సాక్షి
నిజామాబాద్

గురువారం । 2 । నవంబర్ । 2023



స్థానికం నుంచి శాసనసభకు..

స్థానికం నుంచి..
ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు నాయకులు స్థానిక సంస్థల నుంచి చట్ట సభల వరకు ప్రాతినిధ్యం వహించారు.
- 10లో ▸



నియోజకవర్గ కేంద్రంగా..
బాల్కొండ నియోజకవర్గం కేంద్రంగా భీమ్‌గల్‌ను ఎన్నికల కమిషన్ గుర్తించింది. నామినేషన్ల ప్రక్రియ ఇక్కడే సాగనుంది.
- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 34.4 /17.2
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సోషల్ మీడియాలో ప్రచారానికి అనుమతి తప్పనిసరి

సుభాష్‌నగర్: మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) అనుమతి లేకుండా సోషల్ మీడియాలో, ఇంటర్నెట్ బేస్డ్ మీడియాలో, వెబ్ సైట్లలో, రేడియో, ఎఫ్ఎం ఛానళ్లలో ఎన్నికల ప్రచారం చేయొద్దని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున సామాజిక మాధ్యమాలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్, ట్విట్టర్, రేడియో, ఎఫ్ఎం ఛానళ్లు తదితర మాధ్యమాల్లో ఎన్నికల ప్రకటనలు జారీ చేయాలనుకున్న వారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, వ్యక్తులు నిర్ణీత నమూనాలో దరఖాస్తు సమర్పించి అనుమతి పొందాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. గ్రూపుల్లో సభ్యులు ఎవరైనా రెచ్చగొట్టే కామెంట్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నాయకుల ప్రసంగాలు వైరల్ చేసిన వారితోపాటు గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

3న వాహనాల వేలం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని అబ్కారి శాఖ కార్యాలయంలో వివిధ కేసులో జప్తు చేయబడిన వాహనాలను ఈనెల 3న వేలం వేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో దిలీప్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ఆటోలు, ఎనిమది బైక్‌లకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు బోర్గాంలోని ఎక్సైజ్ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఢిల్లీకి చేరిన ఇందూరు మట్టి



నిజామాబాద్‌నాగారం: మేరీ మాటి – మేరా దేశ్ పేరుతో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి సేకరించిన మట్టి ఢిల్లీలోని అమృత్ కాల్ స్మారక నిర్మాణ స్థలానికి బుధవారం చేరుకుంది. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అన్ని మండలాల నుంచి వలంటీర్లు మట్టిని సేకరించారు. మట్టిని తీసుకొని రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఢిల్లీకి వెళ్లిన వలంటీర్ల బృందానికి రాష్ట్ర ఇన్‌చార్జిగా నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్ వ్యవహరించారు. ఈ బృందం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో ఢిల్లీ వెళ్లి, అక్కడ ఏర్పాటు చేసిన అమృత కలశంలో మట్టి సమర్పించారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం

నిజామాబాద్‌అర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి అన్నారు. బుధవారం నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిజాయతీగా ఓటు వేయాలన్నారు. ఓటు వజ్రాయుధం లాంటిదని సీబీసీ ఫీల్డ్ ఆఫీస్ పీవో ధర్మనాయక్ అన్నారు. ఓటుహక్కుపై నిర్వహించిన ఉపన్యాస, వ్యాస రచన, రంగోలి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, స్వీప్ జిల్లా నోడల్ ఆఫీసర్ సురేష్, డీసీవో సింహాచలం, డీపీఆర్‌వో పద్మశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

రేపు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి రాక

కామారెడ్డి టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం కామారెడ్డికి రానున్నారని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్‌లో జరిగే పోలింగ్ బూత్ విజయ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పొందుర్తి వద్ద ఆయనకు స్వాగతం పలుకుతామని, అక్కడినుంచి రాజారెడ్డి గార్డెన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక


నాగిరెడ్డిపేట: గోపాల్‌పేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవరావు కుమారుడు సందీప్‌కుమార్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కింతలి గ్రామానికి చెందిన బెండి వాసుదేవరావు 2000 సంవత్సరం నుంచి మండలంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కుమారులిద్దరూ మండలంలోనే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. సందీప్‌కుమార్ గతేడాది సివిల్స్ రాయగా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి.

రేపే.. నామినేషన్ల ఘట్టం

- ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు
- రెండుమూడు విడతల్లో నామినేషన్ సెట్ల దాఖలుకు ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు చోట్ల ఇప్పటికీ ఖరారు కాని బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు

కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి జిల్లాలో అధికార పార్టీ సిట్టింగులందరికీ ఇప్పటికే టికెట్లు ఖరారు కాగా, నామినేషన్ల దాఖలుకు బ్రాహ్మణులు, మతపెద్దల ద్వారా ముహూర్తాలు ఖరారు చేయించుకుంటున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికీ ఖరారు కాలేదు. ఈ నెల 28 వరకు మాత్రమే ప్రచారానికి అవకాశం ఉన్న నేపథ్యంలో ఆశావహులు టెన్షన్ పడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, నిజామాబాద్



తెలంగాణ శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ వెలువడడంతో ప్రవర్తన నియమావళి అమలవుతోంది. ఇక కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం శుక్రవారం ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నెల 10 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు ఉంది. 13న నామినేషన్ల పరిశీలన, 15వ తేదీ వరకు ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో అధికార బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి సిట్టింగులందరికీ ఇప్పటికే టికెట్లు ఖరారు కావడంతో ఆయా అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు బ్రాహ్మణులు, మతపెద్దల ద్వారా ముహూర్తాలు ఖరారు చేయించుకుంటున్నారు. ఐదు సెట్ల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం ఉండడంతో ఆయా డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఆస్తి వివరాలు నమోదు చేయడంలో లోపాలు తలెత్తిన కారణంగా రాష్ట్రంలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఇప్పటికీ కోర్టు కేసులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆరే తమ పార్టీ అభ్యర్థులకు అవగాహన కల్పించారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని అభ్యర్థులందరూ తగినవిధంగా సిద్ధమవుతున్నారు. తమ పేరుబలం ప్రకారం ముహూర్తం మేరకు నామినేషన్ దాఖలు, ఇతర రోజుల్లో అదనపు నామినేషన్ సెట్లను దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు సైతం నామినేషన్ల దాఖలుకు తగిన ముహూర్తం చూసుకుంటున్నారు.

ఖరారు కాని సీట్లలో ఆశావహుల టెన్షన్..

నామినేషన్ల పర్వం ప్రారంభానికి కేవలం కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో ఇప్పటికీ నాలుగు నియోజకవర్గాల్లో ప్రధానమైన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన అభ్యర్థులు ఖరారు కాలేదు. రాష్ట్రంలో ఏ ఉమ్మడి జిల్లాలోనూ ఈ రెండు పార్టీలకు సంబంధించి ఇన్ని సీట్లలో అభ్యర్థుల ఖరారు పెండింగ్‌లో లేదు. దీంతో ఆయా పార్టీల శ్రేణులు గందరగోళంలో ఉన్నాయి. బాన్సువాడ నియోజకవర్గం విషయానికి వస్తే కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటివరకు అభ్యర్థులను ఖరారు చేసే విషయంలో వ్యవహారం కొలిక్కి రాలేదు. ఇక బీజేపీ బాన్సువాడతో పాటు బోధన్, నిజామాబాద్ రూరల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో ఇప్పటికీ తేల్చలేదు. దీంతో ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది. బీజేపీ బీసీ కార్డు తెరమీదకు తీసుకురావడంతో పాటు తదుపరి జాబితాలో బీసీలకు ఎక్కువ సీట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో ఆశావహుల్లో మరింత టెన్షన్ నెలకొంది.

కాంగ్రెస్ కసరత్తు

కాంగ్రెస్ పార్టీ సైతం బాన్సువాడతో పాటు జుక్కల్, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్ టిక్కెట్లను ఖరారు చేయలేదు. ఈ టిక్కెట్ల విషయంలో పార్టీ తీవ్రమైన కసరత్తు చేస్తున్నప్పటికీ వ్యవహారం కొలిక్కి రావడం లేదు. ఆశావహులతో పాటు పార్టీ శ్రేణులు సైతం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఆశావహులు ఢిల్లీ స్థాయిలో తమవంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్ల ఘట్టం మొదలవుతున్నప్పటికీ నాలుగు నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో ఈ విషయమై రాజకీయ వర్గాలతో పాటు ఇతర వర్గాలు సైతం ఆసక్తిగా గమనిస్తుండడం గమనార్హం. ఈ నెల 28 వరకు మాత్రమే ప్రచారానికి అవకాశం ఉన్న నేపథ్యంలో ఆశావహులు మరింత టెన్షన్ పడుతున్నారు.

ప్రతిష్టాత్మకంగా సీఎం సభ



సీఎం కేసీఆర్ సభ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

- నేడు వేల్పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభ
- జన సమీకరణకు కసరత్తు చేస్తున్న పార్టీ శ్రేణులు



మోర్తాడ్: వేల్పూర్ శివారులోని స్పైసిస్ పార్క్‌లో గురువారం నిర్వహించన్ను సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను ఆ పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గతంలో రెండు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార సభను మోర్తాడ్‌లో నిర్వహించారు. అక్కడి ప్రాంగణంలో చిన్నగా ఉండటంతో ఎక్కువ మంది ప్రజలను సమీకరించి ప్రచారం జరిపించాలని స్పైసిస్ పార్క్‌ను ఎంపిక చేశారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి ప్రజలను సమీకరించడానికి బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇటీవలే మోర్తాడ్‌లో ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ మోర్తాడ్‌లో కార్నర్ సమావేశం నిర్వహించారు. కార్నర్ సమావేశం కావడంతో తక్కువ మంది జనంతోనే సమావేశం ముగిసింది. బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ స్వయంగా పాల్గొనే సభలో భారీగా జనం ఉండాలని అన్ని గ్రామాల నుంచి ప్రజలను తరలించడానికి వాహనాలను ఏర్పాటు చేశారు. పార్టీ మండల, గ్రామస్థాయి నాయకులకు బాధ్యతలను అప్పగించి జనాలను సమావేశానికి తరలించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డి ప్రచారం మొదలైంది. అయితే ప్రజా ఆశీర్వాద సభ ద్వారా ప్రచారం వేగం పెంచాలని భావిస్తున్నారు.

కొత్త హామీలపై ఆశలు

సీఎం కేసీఆర్ గతంలో బాల్కొండ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రచార సభల ద్వారా బీడీ కార్మికులకు జీవన భృతి హామీ ఇచ్చి అమలు చేశారు. మహిళలను ఆకట్టుకునే పథకం కావడంతో ప్రశాంత్‌రెడ్డి విజయానికి మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఇప్పుడు నిర్వహించనున్న సమావేశంలో ఏదైనా కొత్త హామీ ఇస్తారా అని పార్టీ శ్రేణులు ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి.

బీజేపీలో చేరిన సుభాష్‌రెడ్డి

నాగిరెడ్డిపేట: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పదవితోపాటు కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన ఆ పార్టీ ఎల్లారెడ్డి ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి బుధవారం బీజేపీలో చేరారు. ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానానికి సంబంధించి కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో ఆయన తీవ్రనిరాశకు గురయ్యారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. బుధవారం ఢిల్లీ వెళ్లిన ఆయన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు.



సుభాష్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి

గుణాత్మక విద్యనందించాలి



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి

పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేలా గుణాత్మక విద్య అందించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చిట్ల పార్థసారథి ఉపాధ్యాయులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో విద్యా స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా చిట్ల ప్రమీల జీవన్‌రాజ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గణితం, సైన్సు, సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టీ నిపుణులతో ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల కమిషనర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై తరగతులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నా విద్యార్థులు పోటీ ప్రపంచంలో తగిన ప్రతిభ కనబరచకపోవడం బాధాకరమన్నారు. విద్యార్థులను పోటీ ప్రపంచంలో నెగ్గుకు వచ్చేలా అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ కోవిడ్ సంక్షోభం తర్వాత విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్ బోధన విస్తరించిందన్నారు. దానికి అనుగుణంగా పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే కీలకమైన విధుల్లో కొనసాగుతూ తన తల్లిదండ్రుల పేరుతో స్థాపించిన ట్రస్టు ద్వారా విద్యాస్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎన్నికల కమిషనర్ పార్థసారథి సేవలను కొనియాడారు. సీపీ కల్మేశ్వర్, ఆర్డీవో వినోద్‌కుమార్, డీఈవో దుర్గాప్రసాద్, రీసోర్స్ పర్సన్లు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్‌చారి, రాజేందర్‌కుమార్, ఎంఈవో రాజ గంగారం, ట్రస్టు కార్యదర్శి ఎస్ నర్సింలు పాల్గొన్నారు.

జేఏసీ నాయకుల గల్ఫ్‌బాట

- వలస కార్మికుల సమాయత్తం కోసం రంగంలోకి..
- రాజకీయ పార్టీలను ప్రభావితం చేయడానికి ప్రణాళిక
- డిమాండ్ల సాధనకు ఈ ఎన్నికలే కీలకమని భావన



దుబాయిలోని క్యాంపులో ఉన్న తెలంగాణ కార్మికులతో జేఏసీ నాయకులు

మోర్తాడ్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలస కార్మికుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు గల్ఫ్ దేశాల్లో పర్యటిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. గల్ఫ్ దేశాల్లో వ్యాపారం చేస్తూ స్థిరపడిన పలువురు కార్మిక సంఘాల నాయకులు త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల నుంచి పోటీ చేయడానికి ఆసక్తి చూపుతూ పలు రాజకీయ పార్టీల బీఫాంలను ఆశించారు. అసెంబ్లీలో అడుగు పెట్టి గల్ఫ్ గళం వినిపించాలని భావించిన ప్రవాసులకు ఏ రాజకీయ పార్టీ కూడా టిక్కెట్లను ఇవ్వడానికి సుముఖత చూపకపోవడం నిరుత్సాహానికి గురి చేసింది. వలస కార్మికులను చిన్న చూపు చూడటమే కాకుండా తమ నాయకత్వ పటిమను గుర్తించకపోవడంతో అన్ని రాజకీయ పార్టీలపై పోరుబాట ఎగురవేయాలని జేఏసీ నాయకులు నిర్ణయించారు.

15 రోజులుగా..

గల్ఫ్ వలస కార్మికులను ఐక్యం చేసి రాజకీయ పార్టీలను ప్రభావితం చేసే యోచనలో ఉన్న నాయకులు 15 రోజుల నుంచి ఆయా దేశాల్లో పర్యటిస్తున్నారు. క్యాంపులలో ఉన్న వలస కార్మికులను కలుసుకుని ఎన్నికల్లో వ్యహరించాల్సిన తీరుపై దిశా నిర్దేశం చేస్తున్నారు. మొదట యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని దుబాయి, షార్జా, అబుదాబి తదితర పట్టణాల్లో ఉన్న తెలంగాణ వలస కార్మికులను జేఏసీ నాయకులు కలిశారు. అలాగే ఖతర్, బహ్రెయిన్‌లలోను పర్యటించారు. ఇంకా ఒమాన్, కువైట్ దేశాల్లో కూడా వలస కార్మికులను కలుసుకునే యోచనలో నాయకులు ఉన్నారు. కార్మికులతో మాట్లాడి గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమం అంశంపై ఏ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని వివరించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత వలస కార్మికుల ఊసేలేదని ఎక్కడ కూడా కార్మికులకు ప్రయోజనం కలిగించే కార్యాచరణ జరగడం లేదని వెల్లడించారు.

బోర్డు ఏర్పాటు చేయాలి

గల్ఫ్ వలస కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు లేదా ప్రవాసీ విధానం(ఎన్ఆర్ఐ) పాలసీ అమలు చేయాలని, దీని కోసం ఓటు అనే ఆయుధంతో కార్మికుల కుటుంబాలు అభ్యర్థులు గుర్తించేలా చేయాలని సూచించారు. వలస కార్మికులు తమ ఇండ్లకు ఫోన్ చేసి గల్ఫ్ అంశంను గుర్తించే అభ్యర్థులను, పార్టీలను చేరదీసేలా చేయాలని నాయకులు సూచించారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి ఆయా గల్ఫ్ దేశాల్లో 2.90 లక్షల మంది వలస కార్మికులు ఉన్నారని అంచనా. అంటే కనీసం ఆరు లక్షల ఓట్లు గల్ఫ్ ప్రవాస కుటుంబాలకు సంబంధించినవి అని స్పష్టమైతుంది. గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకులు మంద భీంరెడ్డి, జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవిగౌడ్, జేఏసీ నాయకులు స్వదేశ్ పరికిపండ్ల తదితరులు ఆయా దేశాల్లో పర్యటిస్తున్న వారిలో ఉన్నారు.

రెండో రోజూ అదే జోరు!

- ప్రతిపక్షాలపై నిప్పులు చెరిగిన కేటీఆర్
- గులాబీ శ్రేణుల్లో జోష్ నింపేలా మాటలతూటాలు
- భిక్కనూరు, దోమకొండ సభల సక్సెస్‌తో కేడర్‌లో ఉత్సాహం



భిక్కనూరులో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు/దోమకొండ: కామారెడ్డి నియోజకవర్గంలో బుధవారం రెండుచోట్ల బీఆర్ఎస్ సభలు నిర్వహించారు. భిక్కనూరు, రాజంపేట మండలాలకు సంబంధించి భిక్కనూరులో, దోమకొండ, బీబీపేట మండలాలకు సంబంధించి దోమకొండలో నిర్వహించిన సభలలో కేటీఆర్ పాల్గొన్నారు. ఆయన కాంగ్రెస్, బీజేపీ నాయకులను టార్గెట్ చేస్తూ మాట్లాడారు. కామారెడ్డి ఉద్యమాల గడ్డ అని, ధూంధాం ఇక్కడే పుట్టిందని పేర్కొన్నారు. ఉద్యమ వేడి రగిల్చింది కూడా కామారెడ్డే అన్నారు. ''గంప గోవర్ధన్ చేతిలో వరుసగా ఓడిపోయిన షబ్బీర్‌అలీ కేసీఆర్ మీద పోటీ చేయడానికి వెనుకడుగు వేసి నిజామాబాద్‌కు పోతున్నడట. బీజేపీ వాళ్లు కూడా కేసీఆర్ మీద పోటీకి భయపడి నాలుగు రోజులు సప్పుడు లేకుండున్నరు. ఇప్పుడు గుజరాత్ నుంచి పైసల సంచులు వచ్చినట్టు ఉన్నయి. అందుకే మళ్ల ఆడాడ తిరుగుతున్నడట'' అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుడు షబ్బీర్ అలీని గంప గోవర్ధన్ గంప కింద కమ్మినట్టే, ఇప్పుడు కేసీఆర్ మీద పోటీ చేస్తానని వస్తున్న రేవంత్‌రెడ్డిని కూడా గంప కింద కమ్మాలన్నారు.

పిప్పరమెంట్ల లెక్క సలాక, సిమెంటు ఇస్తున్నరు

రాష్ట్రమంతటికీ రూ. కోట్ల నిధులు ఇచ్చే ముఖ్యమంత్రి కామారెడ్డికి వస్తున్నారని, బీజేపీ వాళ్లు సలాక, సిమెంటు ఇస్తే సరిపోతదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎంత సిమెంటు, సలాకలు ఇచ్చినా డిపాజిట్టు వచ్చేదిలేదన్నారు. కేసీఆర్ రాంగనే జంగంపల్లి నుంచి కామారెడ్డి దాకా భూములు గుంజుకుంటడని తలకాయ లేని మాటలు మాట్లాడుతున్న బీజేపీ నాయకుడికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ పార్టీకి పొరపాటున అధికారం ఇస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని పేర్కొన్నారు. అప్పటి పోసానిపల్లె నేటి కోనాపూర్‌తో కేసీఆర్‌కు పేగుబంధం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఈనెల 9న నామినేషన్ వేస్తారని మంత్రి తెలిపారు. ఆరోజు కామారెడ్డిలో నిర్వహించే బహిరంగ సభకు ఇంటికొకరు చొప్పున తరలిరావాలన్నారు.

కర్ణాటకలో సాగుకు ఐదుగంటల కరెంటే..

మోర్తాడ్/వేల్పూర్: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వ్యవసాయానికి ఐదు గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నదని, అది కూడా అర్ధరాత్రి ఇస్తున్నారని ఆ రాష్ట్ర రైతు సంఘం నాయకుడు పరశురాం లక్ష్మణ్ అన్నారు. వేల్పూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన రైతుల సమావేశంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డితోపాటు వివిధ రాష్ట్రాల రైతు నాయకులతో కలిసి పరశురాం లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం రైతులను దగా చేస్తే ఇక్కడి కేసీఆర్ ప్రభుత్వం 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను కంటికి రెప్పలా కాపాడుతున్నదన్నారు. సమావేశంలో రాష్ట్ర రైతు నాయకుడు కోటపాటి నర్సింహానాయుడు, రఘునాథ్ దాదా పాటిల్(మహారాష్ట్ర), రాఘవేంద్ర కుమార్(ఉత్తర్‌ప్రదేశ్), సేవాసింగ్ ఆర్య(హర్యానా), డాక్టర్ మంగిరామ్(హర్యానా), కేఎం రామ గౌండర్(తమిళనాడు), నాగరాజు(కర్ణాటక), అన్నమంతరావు(తమిళనాడు), బాలసాహెబ్ వాడ్కే(మహారాష్ట్ర) తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు నాయకుడు

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



డిచ్‌పల్లి: జాతీయస్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని రాణి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోదావరి బుధవారం తెలిపారు. హన్మకొండ కాకతీయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళా సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాణి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 4 నుంచి 8 వరకు జమ్మూకాశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో నిర్వహించే 45వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణి పాల్గొంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థినిని ప్రిన్సిపాల్ గోదావరి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వనిత, ఉపాధ్యాయులు నల్లూరి లత, మౌనిక, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

ఖోఖో విజేతలుగా నిజామాబాద్ జట్లు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని గండిమాసానిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఖోఖో పోటీలను బుధవారం నిర్వహించారు. 33వ సబ్ జూనియర్ ఖోఖో పోటీలను ఖోఖో క్రీడల చైర్మన్ అనిల్, అధ్యక్షుడు భూమయ్య ప్రారంభించారు. బాలుర విభాగంలో జ్యోతిబా పూలే పాఠశాల (కంజర) విజేతగా నిలవగా పోచంపాడ్ గురుకుల పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో బాల్కొండ కేజీబీవీ ప్రథమ బహుమతి, మోస్రా జెడ్పీ పాఠశాల ద్వితీయ బహుమతిని దక్కించుకున్నాయి. కార్యక్రమంలో పీడీలు అతీఖుల్లా, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మందారం కథల పోటీ విజేతల ఎంపిక

నిజామాబాద్ సిటీ: జాతీయ స్థాయి మందారం కథల పోటీ–2023 ఫలితాలను మందారం సాహిత్య సమాఖ్య కన్వీనర్ దారం గంగాధర్ బుధవారం వెల్లడించారు. పోటీలలో నీరు లేని నది రచన చేసిన కోపూరి పుష్పాదేవి విజయవాడకు ప్రథమ బహుమతి, జీవన సాఫల్యం రచన చేసిన కేవీ సుమలత గుడివాడ ద్వితీయ బహుమతి, గృహదేవత రచన చేసిన సంబరాజు లీల కొత్తపేట హైదరాబాద్‌కు తృతీయ బహుమతికి ఎంపికైనట్లు వెల్లడించారు. అలాగే ప్రోత్సాహక బహుమతులకు ఏడుగురిని ఎంపికైనట్లు తెలిపారు. బహుమతుల ప్రధానోత్సవాల కార్యక్రమం తేదీ, వేదికను త్వరలో వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు కబడ్డీ ఎంపికలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు ఈ నెల 3న క్యాంపస్ క్రీడామైదానంలో నిర్వహించనున్నట్లు వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ జి.బాలకిషన్ బుధవారం తెలిపారు. అంతర్ కళాశాలల ఎంపికకు తెయూ పరిధిలోని అనుబంధ డిగ్రీ, పీజీ కళాశాలలు, వృత్తి విద్యా కళాశాలల్లో చదువుతున్న 17 నుంచి 21 సంవత్సరాల వయస్సు వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఎంపిక చేసిన జట్టు ఈ నెల 9 నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

స్థానికం నుంచి శాసనసభకు..

- గ్రామ, మండల స్థాయిలోనే రాజకీయ ఓనమాలు దిద్దిన మాజీ ఎమ్మెల్యేలు


తాడూరి బాలాగౌడ్


లింగారెడ్డిగారి కిషన్‌రెడ్డి


యెర్వ శ్రీనివాస్‌రెడ్డి


నేరేళ్ల ఆంజనేయులు


బి. జనార్దన్‌గౌడ్

నాగిరెడ్డిపేట: 'ఇంట గెలిచి బయట గెలవాలి' అన్న సామెతకు అనుగుణంగానే ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చాలామంది మాజీ ఎమ్మెల్యేలు గ్రామస్థాయి రాజకీయాల్లోనే ఓనమాలు దిద్ది శాసనసభలో అడుగుపెట్టారు. గ్రామస్థాయిలో రాజకీయంగా వారు వేసిన అడుగులే వారిని శాసన సభకు ఎంపికయ్యేలా చేశాయి. వార్డుసభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీ లు, పంచాయతీ సమితి అధ్యక్షులు, సహకార సంఘాల చైర్మన్లుగా పనిచేసిన నాయకులెందరో శాసనసభలో అడుగుపెట్టారు. దీనిపై ప్రత్యేక కథనం.

బాన్సువాడ నియోజకవర్గం:
1989లో నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బాన్సువాడ అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసి గెలుపొందిన కత్తెర గంగాధర్ 1984–1989 వరకు బాన్సువాడ ఎంపీపీగా కొనసాగారు.

- 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి 1978లో దేశాయిపేట సొసైటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1981లో ఎల్‌ఎంబీ డైరెక్టర్‌గా, 1987లో డీసీసీబీ చైర్మన్‌గా పదవిలో కొనసాగారు.

ఆర్మూర్ నియోజకవర్గం:
1985లో నిర్వహించిన ఎన్నికల్లో ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏలేటి మహిపాల్‌రెడ్డి మొదట కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. దీంతోపాటు ఈయన భీమ్‌గల్ పంచాయతీ సమితి సభ్యుడిగా కొనసాగారు. అనంతరం టీడీపీ అభ్యర్థిగా ఆర్మూర్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

- 1978, 1983, 1989 ఎన్నికల్లో ఆర్మూర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన శనిగరం సంతోష్‌రెడ్డి 2001లో భీమ్‌గల్ జడ్పీటీసీగా గెలుపొంది జడ్పీ చైర్మన్‌గా కొసాగారు. జడ్పీచైర్మన్ పదవిలో కొనసాగుతున్నప్పుడే 2004లో నిర్వహించిన ఎన్నికల్లో జడ్పీచైర్మన్ పదవీకి రాజీనామా చేసి ఆర్మూర్ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

నిజామాబాద్ రూరల్: 2008లో డిచ్‌పల్లి నియోజకవర్గానికి నిర్వహించిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆకుల లలిత అంతకుముందు మక్లూర్ ఎంపీపీగా కొనసాగారు.

- 2014లో నిర్వహించిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా రూరల్ స్థానం నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన బాజిరెడ్డి గోవర్ధన్ మొదట 1881లో సిరికొండ మండలం చీమన్‌పల్లి సర్పంచ్‌గా కొనసాగారు. 1987లో కాంగ్రెస్ తరఫున సిరికొండ మండల పరిషత్ అధ్యక్షుడిగా కొనసాగారు. 1995లో స్వతంత్ర అభ్యర్థిగా మండల పరిషత్ అధ్యక్షుడిగా కొనసాగారు. అనంతరం 1999లో జరిగిన ఎన్నికల్లో ఆర్మూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి బాజిరెడ్డి గోవర్ధన్ ఎమ్మెల్యేగా కొనసాగారు.

ఎల్లారెడ్డి నియోజకవర్గం

లింగంపేట మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన తాడూరి బాలాగౌడ్ మొదట ఎల్లారెడ్డి పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. అనంతరం 1978 ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన బాలాగౌడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. బాలాగౌడ్ టంగుటూరి అంజయ్య, భవనం వెంకట్రాంరెడ్డి కేబినెట్‌లో చక్కెర పరిశ్రమ, రోడ్లు–భవనాలశాఖ మంత్రిగా పనిచేశారు. ఎమ్మెల్యే పదవి ముగిసిన అనంతరం బాలాగౌడ్ నిజామాబాద్ జడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. అనంతరం 1984, 1989 వరుస పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసి ఎంపీగా రెండుపర్యాయాలు కొనసాగారు.

- లింగంపేట మండలం లొంకలపల్లికి చెందిన లింగారెడ్డిగారి కిషన్‌రెడ్డి 15 ఏళ్ల పాటు సర్పంచ్‌గా కొనసాగారు. దీంతోపాటు సుమారు 17 ఏళ్లు సొసైటీ చైర్మన్‌గా కొనసాగారు. ఇదే సమయంలో ఏడేళ్ల పాటు డీసీసీబీ డైరెక్టర్‌గా పనిచేశారు. 1983లో నిర్వహించిన ఎన్నికల్లో ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- నాగిరెడ్డిపేట మండలం తాండూర్‌కు చెందిన యెర్వ శ్రీనివాస్‌రెడ్డి సర్పంచ్ పదవిలో కొనసాగుతున్న సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వాన్ని ఎన్టీఆర్ మధ్యంతరంగా రద్దుచేశాడు. దీంతో తాండూర్ సర్పంచ్‌గా ఉన్న శ్రీనివాస్‌రెడ్డి టీడీపీ తరఫున ఎల్లారెడ్డి అసెంబ్లీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- గాంధారికి చెందిన నేరేళ్ల ఆంజనేయులు మొదట 1981లో ఎల్లారెడ్డి పంచాయతీ సమితి కో–ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికై తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1987లో ఆయన గాంధారి సహకార సంఘం చైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతోపాటు నిజామాబాద్ ఎన్‌డీసీసీబీ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. 1988లో గాంధారి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1989లో ఎల్లారెడ్డి అసెంబ్లీస్థానానికి జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1994, 1998లలో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొంది ఎల్లారెడ్డి చరిత్రలో హ్యాట్రిక్ సాధించిన నేతగా గుర్తింపు పొందారు.
- నాగిరెడ్డిపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామానికి చెందిన బి.జనార్దన్‌గౌడ్ 1987లో గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా కొనసాగారు. 2007లో తాండూర్ సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన ఆయన 2008లో ఎల్లారెడ్డి స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు.

జంగ్ తెలంగాణ

కామారెడ్డి నియోజకవర్గం

కామారెడ్డి తొలి ఎమ్మెల్యేగా గెలుపొందిన నాగిరెడ్డిపేటకు చెందిన విఠల్‌రెడ్డిగారి వెంకట్రాంరెడ్డి సుమారు 25 ఏళ్ల పాటు గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. 1952, 1957లో కామారెడ్డి, ఎల్లారెడ్డి ఉమ్మడి నియోజకవర్గంలో అన్‌రిజర్వ్‌డ్‌గా ఉన్న కామారెడ్డి స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

- సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన మధుసూదన్‌రెడ్డి 1967లో నిర్వహించిన ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేసి కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అడ్లూర్ ఎల్లారెడ్డి జీపీ వార్డుసభ్యుడిగా, సర్పంచ్‌గా, సింగిల్‌విండో చైర్మన్‌గా కొనసాగారు.
- 1972లో నిర్వహించిన ఎన్నికల్లో కామారెడ్డి స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన వై.సత్యనారాయణ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈయన నల్గొండజిల్లాకు చెందినవారు. ఈయన యుక్తవయసులో హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డారు. మొదట సత్యనారాయణ తెలంగాణ ఫిషర్‌మెన్‌గా, సెంట్రల్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఐదేళ్లపాటు పనిచేశారు. చట్టసభల్లో మత్స్యకారులకు అవకాశం కల్పించాలనే డిమాండ్‌తో గంగపుత్రుడైన సత్యనారాయణకు కాంగ్రెస్ టికెట్ లభించింది.
- 1978లో చేపట్టిన ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బ్రాహ్మణపల్లి బాలయ్య పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈయన కామారెడ్డి జీపీ వార్డుసభ్యుడిగా, ఉపసర్పంచ్‌గా కొనసాగారు.
- 1983లో నిర్వహించిన ఎన్నికల్లో సైకిల్ గుర్తుతో పోటీచేసిన పార్శి గంగయ్య కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈయన మొదట కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లి సర్పంచ్‌గా కొనసాగారు. వ్యాపారరీత్యా కామారెడ్డిలో స్థిరపడిన గంగయ్య కామారెడ్డి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు.
- 1994లో తొలిసారిగా టీడీపీ నుంచి పోటీచేసి కామారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన గంప గోవర్ధన్ 1987లో భిక్కనూర్ మండలం బస్వాపూర్ సింగిల్‌విండో చైర్మన్‌గా పనిచేశారు. 2004లో నిర్వహించిన ఎన్నికల్లో కామారెడ్డి అసెంబ్లీస్థానం పొత్తులో భాగంగా బీజేపీకి దక్కింది. దీంతో 2004ఎన్నికల్లో గంప గోవర్ధన్ టీడీపీ తరఫున ఎల్లారెడ్డి నుంచి పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2009ఎన్నికల్లో మళ్లీ పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా 2011లో ఆయన తన పదవికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. 2012లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 2014, 2018లో చేపట్టిన ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతోపాటు రెండు పర్యాయాలు ఆయన ప్రభుత్వవిప్‌గా కొనసాగారు.

నగరవాసికి డాక్టరేట్



ఖలీల్‌వాడి: నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఆముల కావ్య ఓయూ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఓయూ ప్రొఫెసర్ స్మితా సొంబ్రాణి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో 'స్టడీ ఆన్ ఇంపాక్ట్ ఆఫ్ ఎంప్లాయి ఎంగేజ్‌మెంట్ ఆన్ ఆర్గనైజేషన్ పెర్ఫార్మెన్స్ విత్ రిఫరెన్స్ సెలెక్టెడ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీస్' అనే అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. డాక్టరేట్ పట్టా పొందడం సంతోషంగా ఉందని కావ్య అన్నారు.

చేంగల్ వాసికి..



భీమ్‌గల్: మండలంలోని చేంగల్ గ్రామానికి చెందిన చిప్ప ప్రవీణ్‌కుమార్ బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. కస్టాక్ట్ ప్రేరిత ప్రభావాలు ఆన్ చీప్, వీఎల్‌ఎస్‌ఐ ఇంటర్ కనెక్ట్ పనితీరు విశ్లేషణ అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించాడు. ఓయూ 83వ స్నాతకోత్సవంలో ప్రముఖ బహుళ సంస్థ అడోబ్ సీఈవో చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు.

ఎన్నికలొచ్చే.. మర్యాద తెచ్చే..

నాగిరెడ్డిపేట: ఎన్నికలొచ్చాయి.. ఓటర్లకు ఎనలేని మర్యాదను తెచ్చిపెట్టాయి. అధికారంలో ఉన్నప్పుడు ఒకటికి రెండుసార్లు చేతులెత్తి నమస్తే పెట్టినా పట్టించుకోని కొందరు నాయకులైతే ఎన్నికల పుణ్యమా అని ఇప్పుడు ఓటర్లపై ఎనలేని మర్యాదను కనబరుస్తున్నారు. ఓటర్లు కంటబడగానే చేతులెత్తి వినమ్రతగా దండాలు పెట్టడంతో పాటు అన్నా..తమ్మీ..అక్క..అంటూ ఆప్యాయతతో పలకరిస్తున్నారు. గ్రామాల్లోకి ప్రచారానికి వెళ్లిన నాయకులు ప్రజల యోగక్షేమాలను తెలుసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో గ్రామాల్లో పలుపార్టీల నాయకులు ఉదయాన్నే రోడ్లపైకి చేరి వచ్చి,పోయే ఓటర్లను ప్రేమతో పలకరిస్తున్నారు. ఎవరైనా మరణించిన విషయం తెలిస్తే చాలు వారి బంధు, బలగం కంటే ముందుగానే వారి ఇళ్లకు చేరుకొని అంత్యక్రియలు పూర్తయ్యేవరకు అక్కడే గడుపుతున్నారు. వివిధ పార్టీల నాయకుల ప్రవర్తనను గమనించే కొందరు ఓటర్లు..ఐదేళ్లకొసారి కాకుండా ప్రతి ఏడు ఎన్నికలు వస్తే బాగుండునని భావిస్తున్నారు.

పొగాకు వాడకం మానాలి

నిజామాబాద్‌నాగారం: పొగాకుకు దూరంగా ఉండి ఆరోగ్యాలను కాపాడుకోవాలని అసంక్రమిక వ్యాధుల జిల్లా కోఆర్డినేటర్ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు అన్నారు. నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని అసంక్రమిక వ్యాధుల విభాగానికి సంబంధించి అయోడిన్ లోప రుగ్మతల నివారణ, జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వాసుదేవరావు, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, ఉపాధ్యాయుడు మల్లేశం, విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణఘట్టం సినీ బృందం హంగామా



నిజామాబాద్ సిటీ: కృష్ణఘట్టం సినిమా యూనిట్ బృందం నగరంలో సందడి చేసింది. ఈ నెల 3న కృష్ణఘట్టం సినిమా విడుదల సందర్భంగా చిత్ర బృందం నగరంలోని కాకతీయ ఉమెన్స్ ఫర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రమోషన్ కోసం నిజామాబాద్‌కు విచ్చేశారు. సినిమాలో ఇద్దరు హీరోల్లో ఒకరైనా నగరంలోని అశోక్‌వీధి(కోటగల్లీ)కి చెందిన నల్లకాడి వినయ్ ఈ సినిమాలో నటించారు. విద్యార్థులు హీరో, హీరోయిన్ మాయ నెల్లూరి, డైరెక్టర్ సురేశ్ పల్లాతో సెల్ఫీ దిగారు.

94 చీరలు స్వాధీనం..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రానికి సమీపంలోని టేక్రియాల్ చౌరస్తాలో రూరల్ పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ కారులో 94 చీరలు ఉన్నట్లు గుర్తించి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ దాదాపు రూ.84,600 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎలాంటి ధ్రువ పత్రాలు చూపకపోవడంతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు అప్పగించినట్లు పేర్కొన్నారు. డీఎస్పీ ప్రకాశ్, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న చీరలు

శ్రీవారిని దర్శించుకున్న స్పీకర్


శ్రీవారిని దర్శించుకున్న స్పీకర్, కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కోరిన కోర్కెలు తీర్చే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి అని, తిరుమల దేవస్థానం పరమ పవిత్రమైనదని పేర్కొన్నారు. మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చినట్లు చెప్పారు. లోక కళ్యాణం ముఖ్యమని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, చల్లగా ఉండాలని భగవంతుడిని కోరుకున్నానని తెలిపారు. ఆయన వెంట పోచారం సతీమణి పుష్ప, ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, కోడలు సోని రెడ్డి, మనుమళ్లు ఉన్నారు.

నియోజకవర్గ కేంద్రంగా భీమ్‌గల్



భీమ్‌గల్‌లో ఉన్న ఎన్నికల కార్యాలయం

- అసెంబ్లీ రికార్డుల్లో మాత్రం నియోజకవర్గం పేరు బాల్కొండ
- పునర్విభజనకు ముందు ఆర్మూర్‌లో ఎన్నికల కార్యాలయం
- 2009 నుంచి భీమ్‌గల్‌లోనే..

మోర్తాడ్: అసెంబ్లీ రికార్డుల్లో బాల్కొండ నియోజకవర్గంగా పేరు ఉన్నా నియోజకవర్గం కేంద్రంగా భీమ్‌గల్‌గా ఎన్నికల కమిషన్ గుర్తించడం గమనార్హం. 1952లో నియోజకవర్గం ఆవిర్భవించిన నాటి నుంచి బాల్కొండ పేరుతోనే ఉచ్చరిస్తున్నారు. 1952 నుంచి 2004 వరకు బాల్కొండ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల కార్యాలయం ఆర్మూర్‌లో కొనసాగింది. ఆర్మూర్ నియోజకవర్గానికి మాత్రం భీమ్‌గల్ కేంద్రంగా కొనసాగడం విశేషం. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిన తరువాత భీమ్‌గల్ బాల్కొండ నియోజకవర్గంలో విలీనం కావడంతో ఈ నియోజకవర్గానికి కేంద్రంగా ఈ పట్టణాన్ని గుర్తించారు. భీమ్‌గల్ తహసీల్ కార్యాలయం నుంచి బాల్కొండ నియోజకవర్గంలో నిర్వహించే ఎన్నికల తంతును అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడ ఎన్నికల అధికారిగా అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా నియమితులయ్యారు. ఆమె శుక్రవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు.

ప్రధాన పార్టీలకు కోవర్టు గుబులు

ఖలీల్‌వాడి: అసెంబ్లీ ఎన్నికలు 28 రోజులు ఉండడంతో ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించడంతో నియోజకవర్గంలో పోటాపోటీగా ప్రచారం ముమ్మరంగా జరుగుతోంది. ఇప్పుడు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రధాన రాజకీయపార్టీలు ఈ ఎన్నికల్లో గెలుపొందేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తోంది. దీంతో అభ్యర్థులు ఈసారి ఎలాగైనా గెలువాలని వ్యూహాలు రచిస్తూ ముందుకెళ్తున్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకుల ఆలోచనలు, వ్యూహాలు తెలుసుకునేందుకు కోవర్టులను రంగంలోకి దింపాతున్నాయి. వీరు ఆయా పార్టీల్లో నేతకు నమ్మకంగా ఉండి ఇక్కడి విషయాలను అక్కడికి చేరవేస్తారు. దీంతో ప్రత్యర్థులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్త లు తీసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ ఉమ్మడి జిల్లాలో తొమ్మిది స్థానాలను గెలుపొందగా వాటిని మళ్లీ ఎలాగైనా సాధించుకోవాలని దృష్టి సారిస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై దృష్టి సారించి వారిని ఓడించి విజయం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో కామారెడ్డి నిజామాబాద్ అర్బన్‌లో కాంగ్రెస్ పార్టీ, బాన్సువాడలో బీజేపీ, కాంగ్రెస్, జుక్కల్‌లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించలేదు. నేడో రేపో వీటిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కోవర్టులతో లాభానష్టాలపై బేరీజులు..
కోవర్టులు చెప్పే విషయాలపై అభ్యర్థులు లాభనష్టాలపై బేరీజులు వేసుకుంటారు. కోవర్టులు ఇచ్చే సమాచారం ఎంత వరకు కరెక్ట్ అనే దానిపై సమాచారం తీసుకున్న తర్వాత అభ్యర్థులు ముందుకు వెళ్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రచారం పర్వం ప్రారంభమైంది. ఈ నెల 3న నామినేషన్లు పూర్తయితే ప్రచారం హోరెత్తుంది. ఇంకా ఎన్నికలకు 28 రోజులు మాత్రమే ఉన్నాయి. దీంతో కోవర్టులు చెప్పే ప్రతి విషయాన్ని అభ్యర్థులు నమ్మాల్సి వస్తుంది. కొన్ని పార్టీలు కోవర్టులను లేకున్న గాని ఇతరులు ఉత్సాహంతో విషయాలను అభ్యర్థులకు వివరిస్తారు.

జిల్లాలో పెరిగిన ఓట్లు..

సుభాష్‌నగర్: జిల్లాలో 2018 అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితాతో పోల్చితే ఈసారి 1,65,826 ఓట్లు పెరిగాయి. అర్బన్ నియోజకవర్గంలో అత్యధికంగా 45,328 ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయి. జిల్లాలో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 11,99,985 ఓట్లకుగాను 9,18,666 (76.56) శాతం ఓట్లు పోలయ్యాయి. 2023 తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో 13,65,811 ఓట్లు నమోదయ్యాయి. గతేడాది 1433 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈసారి 1549కి పెరిగాయి. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

నియోజకవర్గం	2018	2023	వ్యత్యాసం
ఆర్మూర్	1,77,446	2,06,344	28,898
బోధన్	1,95,206	2,15,963	20,757
బాన్సువాడ	1,73,230	1,92,841	19,611
నిజామాబాద్ అర్బన్	2,41,438	2,86,766	45,328
నిజామాబాద్ రూరల్	2,18,423	2,48,269	29,846
బాల్కొండ	1,94,242	2,15,628	21,386
మొత్తం	11,99,985	13,65,811	1,65,826

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710. [HA-41758]
- ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్ డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9848211153, 9490786468 [H-788343]

CHANGE OF NAME

- I, G SURESH (Old Name) Changed my Name as JAKKULA SURESH (New Name) S/o. JAKKULA CHANDRA MOHAN R/o. H.No. 5-106/T/10D, Navipet, Nizamabad. 503245. T.S. [Z-799626]
- I, BENJARAM SUKANYA (Old Name) Changed my Name as MANDA SUKANYA REDDY (New Name) W/o. MANDA RAJESHWAR REDDY R/o. Flat No: 106, Ganga Towers, Gangasthan -2, Gupanpally, Nizamabad. 503003. T.S. [Z-799627]
- I, SHAIK WAJEED (Old Name) Mustaidpura, Nizamabad. Hence Changed my Name as SHAIK WAJID (New Name) S/o. SHAIK HYDER [Z-799628]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

WANTED

- రామకృష్ణ గ్రూపు, (TS No.1) VJA, HYD శ్రీమంతుల ఇళ్లలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 96038 92233, 62812 08600. [B-1206460]
- మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926. [M-1221793]
- ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డిటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రైం కార్నర్

వరికోత మిషన్ ఢీకొని వృద్ధుడి మృతి

లింగంపేట: మండలంలోని పొల్కంపేటలో వరి కోత మిషన్ ఢీకొని షాబొద్దీన్(70) అనే వృద్ధుడు బుధవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ జెండా వద్ద వృద్ధుడు కూర్చున్నాడు. అదే సమయంలో వరికోత మిషన్ డ్రైవర్ వెనుక చూసుకోకుండా రివర్స్ తీస్తూ గద్దెపై కూర్చున్న షాబొద్దీన్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వృద్ధుడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్..


సాయిలు (ఫైల్)

ఎడపల్లి: మండలంలోని జానకంపేట సర్పంచ్ పాట్లోళ్ల సాయిలు(43) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. సాయిలు ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన సాయిలు ఆకస్మికంగా మృతి చెందడంతో ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

తప్పిన ప్రమాదం



డిచ్‌పల్లి: మండలంలోని ముల్లంగి(బి) గ్రామం నుంచి నిజామాబాద్‌కు బుధవారం సాయంత్రం వడ్ల బస్తాల లోడ్‌తో వస్తున్న లారీ పట్టీలు విరిగిపోవడంతో డిచ్‌పల్లి పీఎస్ శివారులో వంగిపోయింది. లారీలో ఉన్న వడ్ల బస్తాలు తాడు తెగిపోయి రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో లారీ వెనుక ఇతర వాహనాలు ఏవీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే సంబంధీకులు కూలీలతో వడ్ల సంచులను ఇతర లారీలోకి మార్చి తరలించారు. సుమారు గంటకు పైగా వాహనరాకపోకలకు అంతరాయం కలిగింది.

తనిఖీల్లో నగదు పట్టివేత



మద్నూర్/ రుద్రూర్: మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీలో భాగంగా రూ. 2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. నాందేడ్ నుంచి సలాబత్‌పూర్ మీదుగా కారులో వస్తున్న ఒకరి నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నామని ఎలాంటి ఆధారాలు చూయించకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. రుద్రూర్ పీఎస్ పరిధిలోని అక్బర్‌నగర్ శివారులో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రూ.3లక్షల 50వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై నీరేశ్ పేర్కొన్నారు. నగదును బాన్సువాడ ఆర్‌వోకు పంపినట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం



ఖలీల్‌వాడి: విశాఖ–నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి రూ.2 లక్షల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ బుధవారం తెలిపారు. నిజామాబాద్ రైల్వే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు బాసర ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా తనిఖీల్లో 8 కిలోలు గల 8 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.